క్లుప్తంగా

నేడు ప్రజావాణి

తాండూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు స్వీకరించేందుకు సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ప్రజలు ప్రజావాణిని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పార్కింగ్ అడ్డా ఆర్అండ్‌బీ!



ఆర్అండ్‌బీ ప్రహరీ వద్ద నిలిపిన వాహనాలు

వికారాబాద్ అర్బన్: ఉపాధి కోసం హైదరాబాద్‌కు రైళ్లలో వెళ్లే పట్టణ వాసుల వాహనాల పార్కింగ్‌కు ఆర్అండ్‌బీ అడ్డాగా మారింది. పనుల నిమిత్తం వెళ్లేవారు రైల్వే ప్రాంగణంలోని పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపాలి. కానీ.. రైల్వేస్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ అతిథి గృహం ప్రహరి వద్ద వందల కొద్ది వాహనాలు నిలుపుతూ.. ఆర్అండ్‌బీకి వచ్చివెళ్లే వారికి అసౌకర్యం కలిగిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రహరీ వద్ద వాహనాలు పెడితే రూ.500 జరిమానా అని కూడా గోడపై రాయించినా.. వాహనదారులు పట్టించుకోవడం లేదని, పోలీసులు చొరవ తీసుకొని అక్కడ వాహనాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ రికవరీ



శ్రీనివాస్‌కు ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

తాండూరు రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించామని కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కరన్‌కోట్‌కు చెందిన శ్రీనివాస్ గత నెల 29న గ్రామంలో మొబైల్ పోగొట్టుకొని, పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీఈఐఆర్‌తో ఫోన్‌ను గుర్తించామని, ఆదివారం శ్రీనివాస్‌కు చరవాణి అందజేశామని తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇళ్లమధ్య మురుగు



కాలనీలో పారుతున్న నీరు, బురద

బొంరాస్‌పేట: ఏర్పుమళ్లలో పలు వీధులు డ్రైనేజీతో బురదమయంగా మారాయి. ఇలా ఇళ్ల మధ్యన మురుగు జలాలు పారుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈగలు, దోమలతో రోగాల భయం వెంటాడుతుందని, సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మించి సమస్య నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు. ఇదే అంశంపై పంచాయతీ కార్యదర్శి మహేశ్వరిని వివరణ కోరగా.. అండర్ గ్రౌండ్ పనులకు ఎంపీటీసీ నిధులు రూ.3లక్షలు మంజూరయ్యాయని, త్వర్లో పనులు ప్రారంభమవుతాయన్నారు.

దివంగత మంత్రికి నివాళి



చందుమహరాజ్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నరేష్ మహరాజ్, నాయకులు

తాండూరు: దివంగత మంత్రి చందుమహరాజ్ (చంద్రశేఖర్‌రావు) వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చందుమహరాజ్ చౌక్‌లో ఉన్న ఆయన విగ్రహానికి, ఆయన తనయుడు నరేష్ మహరాజ్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరేష్ మహరాజ్ మాట్లాడుతూ చందుమహరాజ్ మరణించి మూడు దశాబ్దాలు గడుస్తున్నా.. ఆయనపై ఉన్న అభిమానం తాండూరు ప్రజల్లో ఏమాత్రం తగ్గలేదన్నారు. పేదల కోసం అహర్నిశలు ఆయన పని చేశారని తెలిపారు.

సమ్మర్‌లో సందడే సందడి

చిన్నారుల ఆటాపాట
- వేసవి శిబిరాల్లో సేదతీరుతున్న విద్యార్థులు
- స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత క్యాంపు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



తైక్వాండో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

తాండూరు టౌన్: ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులు వేసవి సెలవుల్లో సందడి చేస్తున్నారు. కాసింత సేద తీరేందుకు వేసవి శిక్షణా శిబిరాల్లో చేరుతున్నారు. తమకు ఇష్టమైన రంగంలో నైపుణ్యం సాధించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మొబైల్ ఫోన్లతో ఇన్ని రోజులు వీడియో గేమ్స్ ఆడిన పిల్లలు సరదాగా మైదానాలకు పరుగులు తీస్తున్నారు. పిల్లలను మైదానాలకు పంపండి, జీవిత పాఠాలు నేర్చుకుంటారని వ్యాయామ ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు చెబుతున్నారు. క్రీడలు, నృత్యాలు, చిత్రలేఖనం, స్విమ్మింగ్, కరాటే వంటి శారీరక శ్రమను కలిగించే వాటిని పిల్లలు నేర్చుకుంటే మానసిక, శారీరక దృఢత్వం పెంపొందించుకుంటారని చెబుతున్నారు. పట్టణంలో చిన్నారుల కోసం వేసవి శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో వాలీబాల్, ఖోఖో, చిత్రలేఖనం, క్రికెట్, తైక్వాండో, క్లాసికల్ డ్యాన్స్, వెస్టర్న్ డ్యాన్స్, స్విమ్మింగ్, సంస్కృత శ్లోకాలు, పద్యాలు, పాటలు, సంగీతం, వాయిద్య పరికరాల వంటి వాటిలో నిపుణులు పిల్లలకు తర్ఫీదునిస్తున్నారు. ఈ కేంద్రాల వారు సాధారణ నెలవారి ఫీజు వసూలు చేస్తున్నారు. పిల్లలు 24 గంటల పాటు ఇంట్లోనే ఉండటం వల్ల టీవీ, మొబైల్ ఫోన్లకు అతుక్కు పోతున్నారనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంపులకు పంపుతున్నారు.

ఉచిత సమ్మర్ క్యాంపు..

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. స్థానిక వేదిక్ విశిష్ట స్కూల్‌లో కోచ్‌లు అనంతయ్య, రాములు ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్, శివం గ్రామర్ స్కూల్ ఆవరణలో కోచ్ మనోహర్ ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు.

మైదానాలు జీవిత పాఠాలు నేర్పుతాయి



ప్రస్తుతం పిల్లలు వీడియో గేమ్‌లకు అలవాటు పడి మానసికంగా, శారీరకంగా ఇబ్బందుల పాలవుతున్నారు. పిల్లలను మైదానాలకు పంపండి. అక్కడ తోటి వారితో ఎలా మెలగాలో నేర్చుకుంటారు. గెలుపు, ఓటమిలను సమానంగా ఆస్వాదిస్తారు. మైదానాలు జీవిత పాఠాలు నేర్పుతాయి. సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తాయి.

– అనంతయ్య, ఫిజికల్ డైరెక్టర్

తాండూరులో సమ్మర్ క్యాంప్‌లు		
క్రికెట్	సెయింట్‌మార్క్స్ పాఠశాల	8639730046
నృత్యాలు	సెయింట్ మార్క్స్ పాఠశాల	9848887929
వాలీబాల్, ఖోఖో	వేదిక్ విశిష్ట పాఠశాల	9701586893
డ్రాయింగ్, మ్యూజిక్	హంసవాహిణి పాఠశాల	9440395322
తైక్వాండో	శివం గ్రామర్ స్కూల్	9182529170
డ్యాన్స్‌లు	వీఎస్ డ్యాన్స్ అకాడమీ	8121457765
కూచిపూడి	మాధుర్ గ్యాస్ ఆఫీస్ వెనుక	8186058110

భక్తుల సౌకర్యార్థమే ధర్మసత్రం

యాలాల: భక్తుల సౌకర్యార్థం కోసమే ధర్మసత్రాన్ని నిర్మించినట్లు ముద్దాయిపేట ఎంపీటీసీ దేవగారి రాములు అన్నారు. ఆదివారం గ్రామంలో ఈశ్వరాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ధర్మసత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా శివమాల ధారులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు సత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవగారి రమేష్, సంగమేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: పేద ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వార్వల అంజిలయ్యను ఆదివారం ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, మాజీ ఎంపీటీసీ అంజిలయ్య, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శి శివసంతోష్, నాయకులు రమేష్, వెంకటయ్య, యాదయ్య, లాలు, సూరి, మణికంఠ, నర్సింహులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో ఉపాధ్యాయులు

ధారూరు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో 2000–21 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన 65 మంది (నాటి విద్యార్థులు) రెండు దశాబ్దాల అనంతరం ఒక్కటై.. చిన్ననాటి చిలిపి చేష్టలు గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులైన రిటైర్డ్ హెచ్ఎం సతీష్‌చంద్ర, ఉపాధ్యాయులు మాణిక్‌ప్రభు, యేసుదాసు, బస్వరాజ్, నర్సింహులు, ఆంజనేయులును ఘనంగా సన్మానించారు.

బొడ్రాయి ఉత్సవానికి విరాళం

దోమ: అనంతరెడ్డిపల్లిలో నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠాపన, ఆంజనేయస్వామి దేవాలయ ధ్వజస్తంభ ఏర్పాటుకు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకట్రాములు ఆదివారం రూ.51వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అనంతరెడ్డి, హైమద్ పటేల్, నర్సింహులు, సల్మాన్, నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జహంగీర్, కళ్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజప్పగౌడ్

తాండూరు రూరల్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతోనే గౌతపూర్ అభివృద్ధి చెందిందని సర్పంచ్ రాజప్పగౌడ్ అన్నారు. ఆదివారం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు.

మమ అంటారా..? మాట్లాడ్తారా?

- తూతూమంత్రంగా మండల సమావేశాలు
- అధికారుల గైర్హాజరుతో మొక్కుబడిగా..
- అమలు కాని తీర్మానాలు.. పరిష్కారం కాని సమస్యలు
- నేటి సమావేశంలోనైనా చర్చ జరిగేనా!

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరగనుంది. ప్రతి మూడు నెలలకోసారి జరిగే ఈ సమావేశాలు తూతూ మంత్రంగానే కొనసాగుతున్నాయి. అధికారుల గైర్హాజరు.. అభివృద్ధిపై చర్చ జరగకపోవడం.. తీర్మానాలు అమలుకు నోచుకోకపోవడం షరా మామూలైపోయింది. దీంతో సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. కొన్నిశాఖల అధికారులైతే అసలు మండల సమావేశాలను లైట్‌గా తీసుకుంటున్నారు. 'మేమింతే..మమ్మల్ని అడిగే నాథుడే లేడు'అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మండల సర్వసభ్య సమావేశాలకు విలువ లేకుండా పోతోంది. ఏదో నామ్‌కే వాస్తేగా మమ అనిపిస్తున్నారు. ఇప్పటి వరకు 22 సమావేశాలు నిర్వహించారు. ఇందులో మెజార్టీ సభ్యులు చేసిన తీర్మానాలు అమలుకు నోచుకోలేదు. ప్రతి సమావేశంలో 20శాఖల అధికారులకు పూర్తి స్థాయిలో హాజరుకావడం లేదని ఉన్నతాధికారులకు నివేదించారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లులు ఇప్పించాలని చేసిన తీర్మానం అమలు కాలేదు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి 108 అంబులెన్స్ ఏర్పాటు.. దౌల్తాబాద్ పీహెచ్‌సీని 24గంటల పాటు సేవలందించేందుకు అప్‌గ్రేడ్ చేయాలని.. గ్రామాల్లో మిషన్‌భగీరథ నీటిని సక్రమంగా అందించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని తీర్మానాలు అటకెక్కాయి. ఏ ఒక్కటి పరిష్కారం కాలేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. సమస్యలు వినని, పరిష్కార మార్గం సమావేశాలు ఎందుకని, ప్రజాధనం వృథా అని కొందరు సభ్యులు చెబుతున్నారు. కనీసం సోమవారం జరిగే సమీక్షలో అర్థవంతంగా చర్చ జరిగి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వైఖరిలో మార్పు రాకపోతే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

మానవత్వం చాటిన చైర్‌పర్సన్



గాయపడిన వారి వద్ద చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు: రోడ్డు ప్రమాదానికి గురైన వారిని ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నగరం పంజాగుట్ట ప్రాంతానికి చెందిన ఇద్దరు ద్విచక్రవాహనంపై ఆదివారం అనంతగిరికి వెళ్తుండగా.. అటవీ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లడంతో తీవ్ర గాయాలతో పడున్నారు. తాండూరు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న చైర్‌పర్సన్ వీరిని గమనించి తన వాహనాన్ని నిలిపారు. పరిస్థితిని గమనించి 108కు ఫోన్‌చేసి, స్థానిక పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తర్వాత కొద్దిసేపటికే 108 వాహనం రావడంతో వికారాబాద్ ఏరియా ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. ప్రమాదానికి గురైన వారిని ఆసుపత్రికి తరలించే ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చైర్‌పర్సన్‌కు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

నేతలకు పట్టదు.. సామాన్యులకు తప్పదు



పరిగి-సూల్తాన్‌పూర్ మధ్యలో గుంతలమయమైన రోడ్డు

పరిగి: పరిగి పట్టణం నుంచి సుల్తాన్‌పూర్ గ్రామం వరకు 2కిలో మీటర్ల మేర గుంతలమయమైన రహదారిలో తప్పనిసరై వాహనదారులు ప్రయాణిస్తున్నారు. రోడ్డు దుస్థితిపై స్థానికులు మాట్లాడుతూ.. ఈ రోడ్లపై వాహనం నడపాలంటే భయమేస్తుందన్నారు. నిత్యం ప్రమాదాలు జరిగి వాహనదారులు, బాటసారులు గాయాల పాలవుతున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా రోడ్ల పరిస్థితి నేతలకు పట్టదు.. సామాన్యులకు ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలు కాపాడుకో



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గిరి

కుల్కచర్ల: హెల్మెట్ పెట్టుకుంటే మన ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని కుల్కచర్ల ఎస్ఐ గిరి అన్నారు. ఆదివారం వాహనదారులకు హెల్మెట్ వాడకం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో అనవసరమైన వాటికి డబ్బులు ఖర్చు చేస్తుంటాము కానీ.. మన ప్రాణాలకు రక్షణగా నిలిచే హెల్మెట్‌లను తీసుకోకపోవడం ఇబ్బందికరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా



వైద్య చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

చేవెళ్ల: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దామరిగిద్ద మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పామెనలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ వనస్థలిపురం వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో పామెన మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, బాబు, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, కృష్ణయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండుగలతో బంధుత్వాలు బాగు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

సర్పంచ్ రాజు

షాబాద్: పండుగలతో సంబంధాలు, బంధుత్వాలు పెంపొందుతాయని అప్పాజీగూడ సర్పంచ్ రాజు అన్నారు. ఆదివారం అప్పాజీగూడలో బీరప్ప ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి బీరప్ప దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సాంప్రదాయంగా బోనాల పండుగను అత్యంత వైభవంగా జరుపుకొన్నారని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు తీర్చుకున్నామని చెప్పారు. ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అలరించాయి.

జేపీఎస్‌ల అలుపెరుగని పోరు

- వికారాబాద్, తాండూర్ డివిజన్ కేంద్రాల్లో కొనసాగుతున్న దీక్షలు
- రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్
- పంచాయతీల్లో అభివృద్ధి పనులపై ప్రభావం



దోమలో సమ్మె చేస్తున్న కార్యదర్శులు

దోమ: నూతన పంచాయతీ రాజ్‌చట్టం అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సేవలు ఎంతో కీలకంగా మారాయి. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ముందుండి అమలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం 2018లో జేపీఎస్‌ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం వారు 2019 ఏప్రిల్ 11న విధుల్లో చేరారు. నోటిఫికేషన్ ప్రకారం మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ సమయంలో రూ.15 వేల వేతనం అందజేసింది. మూడేళ్ల తర్వాత పర్మనెంట్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే 2022తోనే మూడేళ్ల కాలం ముగియడంతో మరో ఏడాది పొడగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 11తో నాలుగేళ్లు పూర్తయ్యాయి. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో కార్యదర్శులు నిరసనబాట పట్టారు.

రెండు డివిజన్‌లలో నిరవధిక సమ్మెలు..

జిల్లాలోని 18 మండలాల్లో 424 జేపీఎస్‌లు, 5 మంది ఓపీఎస్‌లు విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో టీపీఎస్ఎఫ్ పిలుపు మేరకు సమ్మెకు దిగారు. సమ్మెలో భాగంగా మొదటి రెండు రోజులుగా ఆయా మండలాల్లో నిరవధిక సమ్మె నిర్వహించి, స్థానిక తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. ప్రస్తుతం వికారాబాద్, తాండూర్ డివిజన్లలో జిల్లా వ్యాప్తంగా ఉన్న జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు సమ్మెను కొనసాగిస్తూ.. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. సమ్మె తొమ్మిదో రోజుకు చేరినప్పటికీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ జీఓ విడుదల చేయాలి. నాలుగేళ్ల ప్రొబేషనరి పీరియడ్‌ను సర్వీస్ కాలంగా గుర్తించాలి. ప్రస్తుతం పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోట్ చేయాలి. మరణించిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కారుణ్య నియామకాలు చేపట్టాలి. పరస్పర బదిలీలు, స్పౌస్ బదిలీలకు అవకాశం కల్పించాలి.

అభివృద్ధి పనులకు ఆటంకం

కార్యదర్శుల సమ్మెతో పంచాయతీల్లో అభివృద్ధి, రోజు వారి పనులకు ఆటంకం కలుగుతోంది. మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు, టైపిస్టులతో కలిసి ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు జీపీల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరి దీక్షతో పారిశుధ్య పనులు, నర్సరీల నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, జనన, మరణ ధ్రువపత్రాల జారీ, విద్యుత్ దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాతో పాటు వివిధ రకాల పనులపై ప్రభావం పడే అవకాశం ఉంది.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



జేపీఎస్, ఓపీఎస్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. తమను క్రమబద్ధీకరించేంతవరకు సమ్మె కొనసాగిస్తూనే ఉంటాం. నాలుగేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం.

– దేవి, జేపీఎస్ కార్యదర్శి, గొన్యానాయక్ తండా

పరిష్కరించే వరకు దీక్షలు



తమ సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగిస్తాం. పని భారం ఎక్కువైనా గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలి.

– సంతోషి, జేపీఎస్ కార్యదర్శి, పాలేపల్లి

జీఓ విడుదల చేయాలి



ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ప్రొబేషనరీ పీరియడ్ మూడేళ్ల కాలం ముగిసి, మరో ఏడాది గడిచింది. దీంతో నాలుగేళ్ల కాలం పూర్తయింది. ప్రభుత్వం వెంటనే స్పందించి జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేయాలి.

– మాధవులు, జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు